16,17వ తేదీల్లో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

కంఠేశ్వర్, నవంబర్ 9 : జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 వ తేదీల్లో రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆఫీసర్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ తెలిపారు. శనివారం ఆయన ఆఫీసర్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 35 ఏండ్ల నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి పోటీలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 300 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. పోటీలు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్ల ఎంట్రీలకు ఈ నెల 13 చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ 8712300347 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, భక్తవత్సలం, భవంతి దేవదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనదేశానికి మహోన్నతమైన చరిత్ర ఉంది

ప్రసంగిస్తున్న వక్త శివకుమార్

సుభాష్‌నగర్, నవంబర్ 9: ప్రపంచంలో ఏదేశానికి లేని మహోన్నతమైన చరిత్ర మనదేశానికి ఉన్నదని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు శాఖ ప్రతినిధి నర్ర వెంకట శివకుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇంద్రాణి పాఠశాల ప్రాంగణంలో కళాశాల విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. 1857 స్వాతంత్ర్య సంగ్రామ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు. దేశం కోసం అనేక మంది త్యాగాలు చేశారని, త్యాగమూర్తుల ఫలితమే నేటి మన భారతదేశమని అన్నారు. దేశ నాయకుల స్ఫూర్తితో యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గజానన్, దిగంబర్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన 'విజయ్ టాలెంట్ షో'

విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : జిల్లా కేంద్రంలోని విజయ్ పాఠశాల 44వ టాలెంట్ షోను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాకలి ఐలమ్మమహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, ప్రముఖ గాయకుడు మిట్టాపల్లి సురేందర్, విజయ్ విద్యాసంస్థల కార్యదర్శి అమృతలత హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 2023-24 సంవత్సరానికి అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

జిల్లాలో ఇంటింటి సర్వే షురూ

- నల్లవెల్లిలో సర్వే తీరును పరిశీలించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్
- పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచన

ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో సర్వేలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్‌కుమార్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా సర్వే ప్రారంభించగా.. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఇంటింటి సర్వేను అదనపు కలెక్టర్ సంకేత్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వారి వెంట తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో రాజ్‌కాంత్‌రావు, ఆర్ఐ మోహన్ ఉన్నారు. డిచ్‌పల్లి మండలం బీబీపూర్ తండా గ్రామంలో నిర్వహించిన సర్వేను మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్ పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సూచించారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి, ఎన్యుమరేటర్లు ఉన్నారు. ధర్పల్లి మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో చేపట్టిన సర్వేను ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించారు. ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి నిబంధనల మేరకు వివరాలు సేకరించాలని, ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు.ఇందల్వాయి మండలంలో సర్వే తీరును తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి పరిశీలించారు. గన్నారం, స్టేషన్ తండాతో పాటు గ్రామాల్లోని ప్రజలు ఆధార్ కార్డు పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రుద్రూర్, వర్ని మండలాల్లో చేపట్టిన సర్వేను ఎంఈవో దుర్కి సాయిలు, తహసీల్దార్ సాయిలు పరిశీలించారు.

కులాల జనాభా, ఆర్థిక స్థితిగతుల కోసమే సమగ్ర కుటుంబ సర్వే

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో పర్యటించి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న తీరును బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.వివిధ మతాలు, కులాలకు చెందిన జనాభా ఎంత ఉన్నారన్న విషయం, ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, బోధన్ ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యా దామోదర్, బోధన్ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాంబిరెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే తీరను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. బోధన్ మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో చేపట్టిన సర్వేను బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్యాదాము అధికారులతో కలిసి పరిశీలించారు. బోధన్ ఇన్‌చార్జి డీఎల్పీవో మధుకర్, తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు. నవీపేట మండలం నాగేపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి తహసీల్దార్ వెంకటరమణ, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున పలు సూచనలు చేశారు. ఎడపల్లి మండలంలో సూపర్‌వైజర్ శంకర్ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో సర్వే కొనసాగుతున్నదని బల్దియా కమిషనర్ రాజు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా సర్వే చేపడుతామని తెలిపారు. సర్వేలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యదర్శులు శాంతికుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్ల మండలంలోని ఎనిమిది గ్రామాల్లో సర్వే నిర్వహించగా.. తహసీల్దార్ శ్రీలత నాగేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్, సింగంపల్లి, మాక్లూర్ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి ముత్తెన్న, తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ కవి, రచయిత మేక రామస్వామి కన్నుమూత

సుభాష్‌నగర్, నవంబర్ 9: సాహితీ రంగానికి సుదీర్ఘ కాలంగా సేవలందించిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు మేక రామస్వామి శనివారం ఉదయం కన్నుమూశారు. కళా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆయన కవితలు, రచనలు చేశారు. సినిమా రంగంపై ఆసక్తితో క్లాసిక్ సినిమా క్లబ్‌ను నెలకొల్పి పలు రచనలు, సినిమాలను ప్రదర్శించారు. దిన, వార, పక్ష పత్రిక కేంద్రంగా చరిత్ర సృష్టించిన అరుణ బుక్ హౌస్ స్థాపకుల్లో ఒకరు. సాహితీ, దేశభక్తుల జయంతి, వర్ధంతులను రైల్వే స్టేషన్‌రోడ్ గీతాభవన్ వేదికగా నిర్వహించారు. రామస్వామి మృతికి ప్రముఖ వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు, కవులు నాళేశ్వరం శంకర్, చంద్రశేఖర్, కాసర్ల నరేశ్‌రావు, త్రివేణి, శ్రీపాదకుమార శర్మ, దారం గంగాధర్, ఘంట్యాల ప్రసాద్, రమణాచారి సంతాపం ప్రకటించారు.

బాలోత్సవానికి విద్యార్థులు తరలిరావాలి

డిచ్‌పల్లి, నవంబర్ 9 : మోపాల్ శివారులో ప్రెసిడెన్సీ స్కూల్‌లో ఈనెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు జిజ్ఞాసను పెంచుకోవడానికి, సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలోత్సవ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమాలను 7 నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, రవీందర్, అక్షయ్, రాకేశ్ పాల్గొన్నారు.

నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం

కంఠేశ్వర్, నవంబర్ 9 : జిల్లా కేంద్రంలో మాలల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు సీనియర్ దళిత నాయకులు బంగారు సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాలలందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు రవి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, సిద్ధం రాజేందర్ పాల్గొన్నారు.

బీసీటీయూ నూతన కార్యవర్గం ఏర్పాటు

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బీసీటీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాడవేడి వినోద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కె.బాబు, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా ఎ.మోహన్, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, మహేందర్, శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా ప్రతిభ, స్వప్న, కోశాధికారిగా రాజు, కార్యదర్శులుగా చంద్రశేఖర్, వినోద్‌కుమార్, మాణిక్యం, సతీశ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, గౌరవ సలహాదారులుగా కొట్టూరు రమేశ్, సత్యనారాయణ, ప్రవీణ్ గౌడ్, నర్సయ్య, శ్రీహరి, శ్రీనివాసరాజు, కళ్యాణి, సబిత, కృష్ణాజి, వేణుగోపాల్, రమణస్వామి, శంకర్, విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

కోటగిరి (పోతంగల్), నవంబర్ 9: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కొత్తపల్లి, ఏక్లాస్‌పూర్, లింగంపల్లి, అడ్కస్‌పల్లి, ఎత్తొండ గ్రామాల్లో తహసీల్దార్ గంగాధర్ స్పెషల్ క్యాంపెయిన్‌లను సందర్శించారు. 2025 జనవరి ఒకటి నాటికి 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

నగర మేయర్ నీతూకిరణ్

మాట్లాడుతున్న నగర మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, నవంబర్ 9: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారిని కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర మేయర్ నీతూకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారత – మహిళ ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్‌తోపాటు ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆర్థిక పురోగతి బాగుంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు సైతం మహిళల ఆర్థిక పురోగతి కోసం రుణాలను అందజేస్తున్నాయని తెలిపారు. మహిళ సెక్స్ వర్కర్ల సమస్యలు, వారి ఆర్థిక పురోగతి ఇతర విషయాలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, గాంధీ దవాఖాన సిబ్బంది మల్లికార్జున్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

వినాయక్‌నగర్, నవంబర్ 9: జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌కు చెందిన సంపంగి వెంకటి(19) నీటి కుంటలో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. వివరాలు.. వెంకటి తన స్నేహితుడితో కలిసి శనివారం సారంగపూర్ వద్ద ఉన్న నీటి కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. కొద్దిసేపటికి తన స్నేహితుడు అక్కడి నుంచి వెళ్లిపోగా.. వెంకటి ఒక్కడే చేపలు పడుతూ ఉండిపోయాడు. చేపలు పడుతున్న క్రమంలోప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి మరణించాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటి కుంటలోంచి మృతదేహాన్ని బయటికి తీయించి జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రావ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు ..

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడగా మరో యువకుడు తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఖానాపూర్ గ్రామం వీరభద్ర కాలనీకి చెందిన భీమేశ్(27) తన బావమరిది అనిల్‌తో కలిసి శుక్రవారం రాత్రి బైక్ పై వెళ్తుండగా గుండారం శివారులో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో భీమేశ్ లారీ టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందగా.. అనిల్‌కు గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి వాముకు నిప్పు పెట్టిన దుండగులు

పోతంగల్, నవంబర్ 9 : గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాముకు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు గ్రామానికి గంగాధర్, హర్ష వర్ధన్ అనే యువకులు జీవనోపాధి కోసం నాలుగు గేదెలను తీసుకువచ్చి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని షెడ్డు వేశారు. శుక్రవారం కుటుంబ సభ్యుల సమక్షంలో పశువుల షెడ్డును ప్రారంభించారు. గేదెల కోసం ఏర్పాటు చేసిన గడ్డి వాము పక్కనే మైత్రి భూమయ్యకు చెందిన గడ్డివాము కూడా ఉంది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు భూమయ్య గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న గడ్డి వాముకు నిప్పు అంటుకున్నది. ఒక దానికి ఒకటి అంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్, నవంబర్ 9: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ పర్యవేక్షణాధికారి డాక్టర్ స్వామిరెడ్డి హాజరై పశువులకు టీకాలు వేస్తున్న తీరును పరిశీలించారు. పశువులకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ బస్వారెడ్డి, పశువైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమామాసాహేర్, సిబ్బంది వినీత, కళ్యాణి, పాషా తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్టపై ప్రత్యేక దర్శన టికెట్‌ను రద్దు చేయాలి

ఆలయ ధర్మకర్తతో మాట్లాడుతున్న సర్వసమాజ్ కమిటీ బాధ్యులు

భీమ్‌గల్, నవంబర్ 9: లింబాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక దర్శన టికెట్లు, వాహనాల టోల్ చార్జీలను రద్దు చేయాలని బల్దియా పాలకవర్గ సభ్యులు, సర్వ సమాజ్ బాధ్యులు కోరారు. ఆలయ ధర్మకర్తతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్న సందర్భంగా వాష్‌రూమ్‌లు, తాగునీటి వసతి, బస చేసేందుకు సదుపాయాలను కల్పించాలని ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథిని కోరారు. టోల్ చార్జీల వసూలును విరమించుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. సమావేశంలో సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు అశోక్, అఖిల పక్షం నాయకులు కన్నె సురేందర్, స్వామి, నర్సయ్య, రవీందర్, గంగయ్య, అనంత రావు, జేజే నర్సయ్య, కౌన్సిలర్లు నర్సయ్య, సతీశ్, లింగయ్య, లింబాద్రి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

PLOT FOR SALE
★డిచ్‌పల్లి నుండి ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76=202 Sq.yds. ప్లాట్ల ధర 20,000/- గజం మరియు 34x27=102 Sq.yds. ప్లాట్ల ధర 15,000/- గజం అమ్మకానికి కలవు.
Ph: 9396411685 / 9493984827.
NT-336743

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దివ్యాంగుల పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

బోధన్, నవంబర్ 9: దివ్యాంగుల పింఛన్ల పెంపుదల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయనున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య వెల్లడించారు. బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఎన్‌పీఆర్‌డీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కమిటీల సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల కనీస పింఛను రూ.పది వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నామినేటెడ్ పదువుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నెలలో నిర్వహించే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్వారాజు పాటిల్, జిల్లా అధ్యక్షుడు గైని రాములు, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మోర్తాడ్, నవంబర్ 9: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలో శనివారం తాళం వేసిన ఇంట్లో పట్టపగ లే చోరీ జరిగింది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం.. హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన నాయిని పురుషోత్తం ఉదయం ఇంటికి తాళం వేసి మోర్తాడ్ మండలం దొన్కల్ గ్రామంలో ఉండే సోదరి ఇంటికి వెళ్లాడు. దుండగులు తాళం పగలగొట్టి బీరువాను తెరచి అందులోని ఎనిమిది తులాల బంగారాన్ని చోరీ చేసి వెనకవైపు నుంచి పారిపోయారు. పురుషోత్తం సాయంత్రం వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై అనిల్‌రెడ్డి, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మాక్లూర్, నవంబర్ 9: మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ గుండెపోటుతో ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబానికి జిల్లా, మండల కురుమ సంఘం నాయకులు అండగా నిలిచారు. రూ.26వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో పీపీసీఎస్ చైర్మన్ బుర్కొళ్ల అశోక్, కురుమ సంఘం నాయకులు గణేశ్, అశన్న, పోతన్న, సతీశ్, గంగాధర్, లక్ష్మణ్, జవహర్, భూమన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని శ్రీరామ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఏర్గట్ల, నవంబర్ 9: 18ఏండ్లు నిండిన వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత సూచించారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను ఆమె పరిశీలించారు. మొత్తం 24 దరఖాస్తులు వచ్చాయని ఆర్ఐ సదానంద్ తెలిపారు. రెవెన్యూ అధికారి కిరణ్, వీఆర్ఏ వెంకటేశ్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

బాల్కొండ, నవంబర్ 9: అంబేద్కర్ యువజన సంఘం బాల్కొండ నియోజకవర్గ బాధ్యుడిగా జిన్న జనార్దన్, మండల అధ్యక్షుడిగా ద్యవతి రవి నియమితులయ్యారు. వారికి సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న శనివారం నియామక పత్రాలను అందజేశారు.

ఎస్‌హెచ్‌వోకు సన్మానం

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలను చేపట్టిన సత్యనారాయణ గౌడ్‌ను బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోల సుధాకర్, నాయకులు పూజ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ ఈగ గంగాధర్, మీరా శ్రవణ్, అగ్గు క్రాంతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

డీవీకే విగ్రహావిష్కరణ

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: ఆర్మూర్ పట్టణంలో డీవీకే విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రాంచందర్, నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదల

ముప్కాల్, నవంబర్ 9: ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను మెండోరా మండలంలోని సోన్‌పేట్ చెరువులో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు, ఎంపీడీవో వనజ శనివారం విడుదల చేశారు. మొత్తం 28,550 చేపపిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు.

కమ్మర్‌పల్లిలో నీటి ఎద్దడి

ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

మోర్తాడ్, నవంబర్ 9: తాగునీటి ట్యాంకు వద్ద పైపులు పగిలిపోవడంతో కమ్మర్‌పల్లిలో రెండు రోజులుగా నీరు సరఫరా కావడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ ద్వారా అందరికీ సరిపడా నీళ్లు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్లు కేవలం రెండు, మూడు బకెట్లు మాత్రమే వస్తున్నాయని ప్రజలు అంటున్నారు.

లైంగికదాడి : మహిళ సహా ముగ్గురిపై కేసు నమోదు

నందిపేట్, నవంబర్ 9: మద్యం మత్తులో ఒక మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఉమ్మెడ గ్రామంలో నాలుగు రోజుల క్రితం ఒక మహిళ సహకారంతో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మహిళ (35)పై లైంగికదాడి చేశారు. బాధితురాలు స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన గ్రామస్తులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబీకులు ఆశ్రయమిచ్చిన మహిళపై చేయి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో మంత్రాల నెపంతో బాధితురాలి కుటుంబ సభ్యులు తనపై దాడిచేశారని ఆశ్రయమిచ్చిన మహిళ ఏసీపీకి మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గ్రామంలోకి వెళ్లి విచారణ చేపట్టగా.. అసలు విషయం వెలుగుచూసింది. పోలీసులు ఇద్దరు వ్యక్తులతోపాటు మహిళపై శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు కందకుర్తికి హర్యానా గవర్నర్

రెంజల్, నవంబర్ 9: మండలంలోని కందకుర్తి గ్రామానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం రానున్నారు. త్రివేణి సంగమ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పుష్కరఘాట్ వద్ద గంగా మహాహారతిని ఇస్తారు. కందకుర్తిలోని డాక్టర్ బలిరాం హెడ్గేవార్ స్మృతి కేంద్ర మందిర నిర్మాణ పనులను పరిశీలిస్తారు.

రైల్వే గేట్‌కు మరమ్మతులు : స్తంభించిన ట్రాఫిక్

ఎడపల్లి, నవంబర్ 9: మండల కేంద్రంలోని రైల్వేగేట్ మరమ్మతులను రైల్వే శాఖ అధికారులు శనివారం చేపట్టారు. దీంతో ట్రాఫిక్ బోధన్ – నిజామాబాద్ రహదారిపై రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిని కాలనీవాసులు కోరారు. ఆయనను అంకాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. కాలనీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

భీమన్న పండుగ పోస్టర్ల విడుదల

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: ఈనెల 13,14,15వ తేదీల్లో నిర్వహించనున్న భీమన్న పండుగ ఉత్సవాల పోస్టర్లను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డితో కలిసి ఆదివాసీ నాయక్‌పోడ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా ఉపాధ్యక్షుడు మూడ అశోక్ మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రెంజల్, నవంబర్ 9: ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై సాయన్న శనివారం తెలిపారు. కందకుర్తి గోదావరి మొగుల్‌పూర్ గడ్డ నుంచి బోర్గాం మీదుగా నవీపేటకు శుక్రవారం రాత్రి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తనిఖీ చేశామన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిందితులను శిక్షించాలని రాస్తారోకో

నందిపేట్, నవంబర్ 9: మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టడంతోపాటు సర్ది చెప్పబోయిన తమపై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో బాధితులు రాస్తారోకో చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 3న ముత్యాలమ్మ ఆలయ సమీపంలో షాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యను కారుతో ఢీకొట్టారు. విషయం తెలుసుకొని అదే గ్రామానికి చెందిన బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరె సుధాకర్ మరో వ్యక్తితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మల్లయ్యను దవాఖానలో చేర్పించారు. ప్రమాదానికి కారకులతో మాట్లాడుతుండగా.. కొందరు రాడ్లతో కొట్టి కులం పేరుతో దూషించారని సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానీ తొమ్మిది మందిపై మాత్రమే కేసు నమోదు చేశారని, మిగతా వారిని కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాస్తారోకో చేశారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి నందిపేట్‌కు చేరుకొని బాధితులను సముదాయించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న జడ్జి

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 9: పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా పాల్గొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకొని నిరంతరం శ్రమించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.